# '(అ)సత్యభామ'

కె. సాంబశివరావు

మన్మథరావు పుట్టినరోజు పండగ ఘనంగానే జరిగింది. ఆ రోజున తన కిష్టం లేకపోయినా, తన భార్య మాలతి మాట కొట్టేయలేక పండగ జరుపుకున్నాడు.

పెద్ద హోదాలో ఉన్న వ్యక్తి అవడంచేత పురప్రముఖులు, మిత్రబృందం వచ్చి శుభాకాంక్షలు అందజేసి, ఆయన చేసిన సత్కారాలు అందుకున్నారు.

అనుకోకుండా ఇన్‌కమ్‌టాక్స్‌ఆఫీసరు మిస్ మైనా తన కారులో వచ్చి మన్మథరావుని ఆశ్చర్యచకితుణ్ని చేసింది. తల్లిదండ్రులు అడ్డుతగలకపోతే మైనా అతని భార్య అయి ఉండేది. మన్మథరావు వివాహం మాలతితో జరిగిపోయింది కానీ, మైనా అతన్ని ఆరాధిస్తూ అవివాహితగానే ఉండి పోయింది.

మైనా తను తెచ్చిన కెమేరా అతనికి ప్రేమపూర్వకంగా బహూకరించింది. మన్మథరావు ఫొటో తనే తీసి, తర్వాత డెవలప్ చేసి పంపమన్నది. భోజనం చేసి వెళ్లమన్నా, ఆమె ఏదో కారణం చెప్పి నీళ్లునిండిన కళ్లతో వెళ్లిపోయింది. ఆ త్యాగమూర్తిని తలుచుకుని క్షణం విచలితుడయ్యాడు.


అంతలో అక్కడికి అప్పలాచారి వచ్చాడు. ప్రింటయిన తన నవల 'రాజీవం' అతనికి ఇచ్చాడు. ఆచారి ఆ ఊళ్లోని కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరు. తెలుగులో చాలా నవలలు, కథలు రాశాడు. బహుమతులు కూడా కొన్నిటికి వచ్చాయి. మన్మథరావు తన బాల్యమిత్రుడే కాక, సంగీత సాహిత్యాలంటే అపరిమితమైన ఇష్టం అతనికి. అందుచేత, నవల కాపీలు రాగానే మన్మథరావు కిచ్చాడు. మన్మథరావు సంతోషించాడు.

"ఇవాళరాత్రి 'శ్రీకృష్ణతులాభారం' ఉందోయ్! పెద్దపేరున్న నటకౌస్తుభాలు ఆడుతున్నారట. ఒక వృద్ధ కళాకారుడు కష్టాల్లో ఉంటే అతని సహాయార్థం ఆడుతున్నారట!" అన్నాడు అప్పలాచారి.

"కళాకారుల గతి ఎలాఉందో చూడవోయ్! ప్రభుత్వం కళాకారుల్ని ఆదుకోవాలి కానీ నిర్లక్ష్యధోరణి ప్రదర్శించకూడదు. లారీ మీంచి పడిచస్తే లక్ష ఇస్తున్నారే, ఆపాటి సాయం చస్తూ బతుకుతున్న ఈ కళాకారులకు ఎందుకు అందించరాదో అర్థం కాదు!" అన్నాడు మన్మథరావు.

"ఇవాళ నాటకంలో సత్యభామ వేషం ఎంతో పేరు ప్రఖ్యాతులున్న పెద్దాపురం కస్తూరిబాయి వేస్తోందిట. అంచేత విధిగా చూడాలోయ్! నువ్వూ రావాలి!" అన్నాడు అప్పలాచారి.

రాత్రి తొమ్మిదిన్నరకు అప్పలాచారిని, తన పి.ఏ.ని వెంటబెట్టుకుని జీపులో హాలుకు వెళ్లాడు మన్మథరావు.



ఒడ్డూ, పొడుగూ, ఆకర్షణీయమైన ఆకారంతో, వర్చస్సుతో ఉన్న మన్మథరావు హాల్లోకి రాగానే నాటక సమాజ అధ్యక్షుడు అతన్ని మర్యాదపూర్వకంగా తీసుకెళ్లి మొదటి వరసలో కూచోబెట్టాడు.

అప్పటికే హాలంతా నిండపోయింది. పీసపాటి, షణ్ముఖి పద్యాలు మైకులు హోరెత్తిస్తున్నాయి.

"విన్నావోయ్ ఆ పద్యాలు! గుళికలు! బెంగాల్ రసగుల్లాలు! ఆ కవితా వైభవం, ఆ గాన మాధుర్యం వర్ణనాతీతం. నేను ఆ 'కురుక్షేత్రంలో' ఉన్నంత ఆనందంగా ఉన్నానోయ్! పద్యం చచ్చిందంటారు కానీ, అది చిరంజీవియే! ఏమంటావు?" అన్నాడు మన్మథరావు ఉప్పొంగిపోతూ.

ఇంతలో పి.ఏ. తెప్పించిన టీ తాగారు ముగ్గురూ.

'పదిన్నరయినా ప్రారంభించరేం కర్మ!' అన్నాడు ఆచారి.

"పౌరాణిక నాటకాలు లేటుగానే ప్రారంభం అవుతాయి. ఓపికపట్టు!" అన్నాడు మన్మథరావు సిగరెట్టు పొగవదుల్తూ.

ఇంతలో గంట వాయించారు. లైట్లు తీసేశారు. గాడాంధకారం అలుముకుంది.

"పరాబ్రహ్మ ... పరమేశ్వర ..." ప్రార్థన ప్రారంభం అయింది.

అంతటా నిశ్శబ్దం. ప్రార్థన అయింది.

తెర లేచింది.

నారదమహర్షి మహతి మీటుతూ, చిడతలు వాయిస్తూ మంచిపాట మధురంగా పాడుతూ, శ్రీకృష్ణసంకీర్తనం చేస్తూ సత్యభామా సదనంలోకి వచ్చాడు.

సత్యభామ, శ్రీకృష్ణుడు సరససల్లాపాల్లో ఉన్నారు.

శ్రీకృష్ణుడు నీలమేఘశరీరంతో, మధుర

మందహాస వదనారవిందంతో ఆకర్షణీయం గా ఉన్నాడు. అతిలోక సుందరి అయిన సత్యభామ దగ్గరగా వెళ్లి నారదమహర్షి ఆమెను పొగిడి, ఒక గొప్ప వ్రతాన్ని ఆమెకు చెబుతా నన్నాడు. ఆ వ్రతం అరుంధతి మొదలైనవారు చేశారన్నాడు. ఆ వ్రతం పేరు పుణ్యకవ్రతం అని, దాని ప్రభావం గురించి, వ్రతవిధానాన్ని గురించి అంతా చెప్పి, ఆమెను ముగ్గులోకి దించాడు. ఆ వ్రతఫలం - శ్రీకృష్ణుడు సత్యా దేవి ఇంటే ఉండడం. ఆమె ఆ వ్రతాన్ని పూర్తి చేసింది. వ్రతాంతంలో తన భర్త, లోకా రాధ్యుడు అయిన శ్రీకృష్ణుణ్ని నారద మహర్షికి దానం చేసింది. అప్పుడు ఆమె ఠీవి, దర్పం, గర్వం వర్ణనాతీతం. శ్రీకృష్ణుణ్ని త్రాసులో ఉంచింది. తిరిగి తీసుకోవటానికి తన దగ్గరు న్న ఆభరణాల్ని, ధన, కనక వస్తువుల్ని త్రాసు లో వేసి తూకమేయసాగింది. తన సంపదంతా తరిగిపోయింది. తాను ధరించిన అమూల్యా భరణాలు అన్నీ అయినా కృష్ణుని బరువుకు సరితూగలేదు. ఆమెకు దుఃఖం ముంచు కొచ్చింది. దారీ, తెన్నూ గోచరం అవలేదు. గొప్ప పుణ్యకవ్రతమే అనుకుంది.

అప్పుడు రుక్మిణీదేవి వచ్చి శ్రీకృష్ణుని మనసారా ధ్యానించి, భక్తితో ఒక్క తులసిదళం త్రాసులో ఉంచగానే దాని బరువుకు కృష్ణుడు తేలిపోయాడు.

సత్యభామ గర్వభంగం అయినందుకు నారదమహర్షి సంతోషించాడు.

నాటకం ఆద్యంతం అది ఉత్కంఠ భరితంగా సాగింది. విసుగన్నది కలగలేదు.

సత్యభామ ఆహార్యం, వాచికం, చలాకీ తనం, చిలిపితనం అద్భుతంగా ఉన్నాయ న్నాడు మన్మథరావు. "ఆమె హావభావాలు, ఆ గర్వరేఖ, ఆ ఠీవీ, ఆ దర్పం, ఆ చిరునవ్వుల మెరుపులు, ఆ నటనాకౌశల్యం అసలు సత్యభామవే అనిపిస్తున్నాయి ఆచారీ! పద్యాలు ఆపాతమధురంగా ఉన్నాయి. ఆ సత్యభామ ను గ్రీన్‌రూమ్‌లో ఉండగానే కలిసి 'కంగ్రాట్సు' చెప్పాలి!" అన్నాడు మన్మథరావు.

నాటకం అవగానే ముగ్గురూ సత్యభామ ను గ్రీన్‌రూమ్‌లో కలిశారు.

మన్మథరావు ఆమెను అభినందించి, కర చాలనం చేశాడు. సత్యభామ "థేంక్స్" చెప్పింది.

"మీవంటి రసికులు, సహృదయులు ఉండటం చేతనే నాటకం ఇంకా బతికుంది, సార్!" అన్నది సత్యభామ .

"కస్తూరిబాయిగారూ! మీరు అపర సత్య భామలే!"

"నేను కస్తూరిబాయిని కాను, సార్! ఆమె కు గుండెనొప్పి రావటంతో నటించటానికి రాలేకపోయింది. ఈ నాటకసమాజంవారు ఈ ఆపత్సమయంలో ఆదుకోమని నన్ను బతిమాలారు. నేను సరే అన్నాను. ఏదో వేషం వేశాను."

"ఏదో కాదు, బ్రహ్మాండంగా వేశారు!" అంటూ తన మెళ్లో ఉన్న బంగారం గొలుసు తీసి సత్యభామ మెడలో వేశాడు మన్మథరావు.

పి.ఏ. కెమెరా క్లిక్‌మనిపించాడు.

"మీరు రేపొకసారి నా బంగళాకు వచ్చి, నేనిచ్చే టీ తీసుకుని నన్ను సంతోష పెట్టాలి. మీ నటనాచాతుర్యానికి నా జోహార్లు!" అన్నాడు మన్మథరావు.

00 00 00

ఆ రాత్రి మల్లెపూల పాన్పుపై ఆనంద డోలికల్లో తేలియాడుతున్న సంతోషసమయం లో, మన్మథరావు భార్య మాలతి - "మెడబోసి గా ఉంది, మెళ్లో బంగారం గొలుసేదండీ?" అని భర్తనడిగింది.

మన్మథరావు మందహాసం చేస్తూ, భార్య ను బిగికౌగిట్లో బంధిస్తూ రాత్రి నాటకంలోని సత్యభామకు బంగారు గొలుసు బహూ కరించానన్నాడు.

ఆమె ఆగ్రహోదగ్రురాలై, "చెడు తిరుగుళ్లు తిరగనని ఒట్టేసుకుని, తిరిగి ప్రారంభిం చారా?" అన్నది.

ఆమె అనుమానం నిరాధారమైందని, అపర రతీదేవి వంటి సౌందర్యవతి తనకు భార్యగా ఉండగా తను చెడుతిరుగుళ్లు తిరగ నవసరం లేదన్నాడు. తనను నమ్మమని బతిమాలాడు.

"నమ్మటానికి తమరు ప్రవరాఖ్యులా? అవకాశం దొరికితే జారవిడుచుకునే వారా తమరు!" అన్నది మాలతి.

ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. పక్కమీంచి చప్పునలేచి మండుతున్న ఒంటిని చీర, జాకెట్టుతో కప్పుకుంది.

ఆడవాళ్లని అనుమానపు పిశాచం బాధిస్తూంటుందన్న మాట నిజమేననుకున్నా డు మన్మథరావు.

00 00 00

సాయంత్రం అయిదయ్యేసరికి అప్పలా చారి వచ్చాడు. స్నేహితులిద్దరూ బాతాఖానీ ప్రారంభించారు. రాత్రి సత్యభామ నటనా చాతుర్యాన్ని ఇద్దరూ ప్రశంసించారు.

"ఆమధ్యన దేహసౌష్ఠవం లేని మగవాడు నటించిన సత్యభామ వేషాన్ని చూశానోయ్! పరమఅసహ్యం అనిపించింది" అన్నాడు అప్పలాచారి.

"స్త్రీ వేషాలు స్త్రీలు వేస్తేనే చూడసొంపుగా ఉంటుంది. మగవాళ్లు ఆడవేషాలు వేస్తే బాగుండదు. ఎక్కడో స్థానం నరసింహా రావువంటి ప్రతిభావంతులు ఒకరో, ఇద్దరో స్త్రీ వేషాలు వేసి సెబాష్ అనిపించుకున్నారు. పెళ్లికి పిలవవచ్చిన స్త్రీలు ఆడవేషంలో ఉన్న నరసింహారావు గార్ని చూచి ఆ ఇంటి ఆడ పడుచనుకుని బొట్టుపెట్టి పిలిచారట!" అన్నా డు మన్మథరావు.

"సార్! ఎవరో సత్యభామగారట. తమ దర్శనానికి వచ్చారు!" అన్నాడు జవాను.

"లోపలకు రప్పించాడు మన్మథరావు. వచ్చిన ఆ వ్యక్తిని చూసి, "సత్యభామ మీరేనా? మగవాళ్లు ఆడంగుల పేరు పెట్టుకోవడం కూడా చేస్తున్నారన్నమాట! ఇది చాలా షేమ్ ఫుల్!" అన్నాడు మన్మథరావు చిరాకు ప్రద ర్శించి.

వచ్చిన వ్యక్తి నమస్కరిస్తూ, "సార్, క్షమించండి! నా పేరు సత్యభామ కాదు. రాత్రి సత్యభామగా నటించింది నేనేనండి. జిల్లాపరిషత్‌లో సీనియర్ అసిస్టెంటునండీ! తమరు రాత్రి బంగారుగొలుసు బహూక రించి, ఇవాళ టీకి ఆహ్వానించారని వచ్చా నండీ!" అన్నాడు.

"సారీ! సారీ ... కూచోండి. మీరు రాత్రి స్త్రీయే అనుకున్నానండీ ఆ వేషభాషల్లో! మగ వాడనుకోలేదు. సత్యభామ వేషధారిణి ... బ్రహ్మాండంగా ఉన్నారు ఆ వేషంలో. స్థానం నరసింహారావంతటి ప్రతిభ ఉన్నవారు మీరు!'

"సుప్రసిద్ధ నటి కస్తూరిబాయి అనారోగ్య కారణంచేత రాత్రి నాటకంలో నటించలే నన్నదిట. కమీటీవాళ్లు నా దగ్గరకొచ్చి నన్ను సత్యభామ వేషం వేయమని కాళ్లావేళ్లా పడ్డారు. వ్యవధి తక్కువయినప్పటికీ, తోటి కళాకారుని సహాయార్థం వేస్తున్న నాటకం అవడంచేత, ఒప్పుకున్నాను. రిహార్సల్సూ, అవీ తక్కువయినా ఏదో నటించాను ...!

"నో! నో! నో! ఏదో నటించడం కాదు, బ్రహ్మాండంగా నటించారు. పురుషుడు స్త్రీ వేషం వేసి, స్త్రీయే అన్న భ్రమ కల్పించిన మీ నటనాచాతుర్యాన్ని పొగొట్టడానికి భాష చాల దండీ!" అని భార్య మాలతిని ఆ గదిలోకి రప్పించాడు మన్మథరావు.

"ఇదుగో, ఈయనే రాత్రి నీతో చెప్పిన అపర సత్యభామ - తన నటనా చాతుర్యంతో నన్ను మెప్పించి నా బంగారుగొలుసు బహు మతి పొందిన (అ)సత్యభామ! అమ్మా, ఆ గొలుసు మా శ్రీమతికి చూపించి నన్ను కాపా డండి!" అంటూ బిగ్గరగా నవ్వాడు మన్మథ రావు.

మెరుస్తున్న ఆ గొలుసుని చూడగానే మాలతి అనుమానపు చీకట్లు పటాపంచల య్యాయి. ఆమె ముఖారవిందం ముసిముసి నవ్వులతో ప్రఫుల్లమయింది. (అ)సత్యభామకు బ్రహ్మాండమైన టీపార్టీ ఇచ్చింది. Ⓟ